11 నుంచి కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు

- రోజుకో వాహనంపై విహరించనున్న స్వామివారు
- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలో కొలువైన కల్యాణ వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు 11న ధ్వజారోహణంతో ప్రారంభమై 19వ తేదీ చక్రస్నానంతో ముగియనున్నాయి. స్వామి వారు 9 రోజుల పాటు ఉదయం, రాత్రి వేళల్లో వివిధ వాహనాలపై ఊరేగుతూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

వాహన సేవల వివరాలు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా 11న ఉదయం ధ్వజారోహణం, రాత్రి పెద్దశేష వాహనం, 12వ తేదీ ఉదయం చిన్నశేష, రాత్రి హంస వాహనం, 13న ఉదయం సింహ వాహనం, రాత్రి ముత్యపు పందిరి, 14న ఉదయం కల్పవృక్ష, రాత్రి సర్వభూపాల వాహనం, 15న ఉదయం పల్లకి ఉత్సవం, సాయంత్రం ఊంజల్ సేవ, రాత్రి గరుడవాహనం, 16న ఉదయం హనుమంత, సాయంత్రం స్వర్ణరథం, రాత్రి గజ వాహనం, 17న ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్ర ప్రభ, 18న ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వవాహనం, 19వ తేదీ ఉదయం పల్లకీ ఉత్సవం, చక్రస్నానం, ధ్వజావరోహణం నిర్వహించనున్నారు.

ధ్వజారోహణం

స్వామివారి బ్రహ్మోత్సవాలకు ముక్కోటి దేవతలు, అష్టదిక్పాలకులను వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా ఆహ్వానిస్తూ గరుడ చిత్రపటాన్ని ధ్వజస్తంభంపైకి ఎగురవేసి ధ్వజారోహణం చేస్తారు. ధ్వజం ఆలయంలో జీవస్థానం. ధ్వజారోహణాన్ని చూస్తే ఒకే చోట ముక్కోటి దేవతలను చూసినంత భాగ్యం కలుగుతుందని ప్రతీతి.



ధ్వజారోహణం (ఫైల్)

పెద్దశేష వాహనం

పెద్దశేష వాహనంపై స్వామి లోకరక్షకుడిగా దర్శనమిస్తారు. పెద్ద శేషునిపై స్వామివారిని దర్శించుకున్న భక్తులకు యోగసిద్ధి చేకూరుతుంది.

చిన్నశేష వాహనం

చిన్నశేష వాహనంపై కొలువుదీరిన స్వామివారిని దర్శించుకుంటే సమస్త పాపాలు తొలగి పరమ పదం పొందుతారని భక్తుల నమ్మకం.

హంస వాహనం

పాలు, నీటిని వేరు చేసే వివేకం హంస సొంతం. హంస వాహనంపై స్వామి వారు శారదాంబ(సరస్వతీ దేవి)గా దర్శనమిస్తారు. ఆయనను దర్శించుకుంటే సకల విద్యలు, జ్ఞానం పొందుతారని నమ్మకం.

సింహ వాహనం

సర్వ సంపదలకు ఆది దేవుడైన స్వామి యోగముద్రలో నృసింహ అవతారంలో సింహ వాహనంపై కొలువుదీరుతారు. ఆయనను దర్శించుకుంటే ఐశ్వర్యం, వీర్య, యశస్సు, శ్రీ(ప్రభ), జ్ఞానం, వైరాగ్యం అనే ఆరుగుణాలను ప్రసాదిస్తారని ప్రతీతి.

ముత్యపు పందిరి

తెల్లని, చల్లని ముత్యపు పందిరిపై ఊరేగుతున్న స్వామిని సేవించిన భక్తులకు తాపత్రయాలు తొలగి కైవల్యం చేకూరుతుందని నమ్మకం.



రథోత్సవం (ఫైల్)

కల్పవృక్ష వాహనం

కోర్కెలను నెరవేర్చేది కల్పవృక్షం. కల్పవృక్షంపై ఆశీనులైన స్వామిని దర్శించుకునే భక్తులకు మోక్షం ఇస్తాడని భక్తుల ప్రతీతి.

సర్వభూపాల వాహనం

సర్వభూపాల వాహనంలో అష్టదిక్పాలకులు కొలువై ఉంటారు. ఈ వాహనంపై విహరించే స్వామిని దర్శించుకుంటే రాజ్యసుఖప్రాప్తి చేకూరుతుందని పురాణాలు తెలుపుతున్నాయి.

పల్లకీ వాహనం

లోకంలోని సమస్త జీవరాశుల దుఃఖాన్ని తొలగించేందుకు ఆదిదేవుడు పల్లకీపై జగన్మోహినిగా దర్శనమిస్తారు. స్వామివారిని దర్శించుకుంటే అష్టసిద్ధులను అనుగ్రహిస్తాడు.

గరుడ వాహనం

శ్రీవారి వాహనమైన గరుత్మంతుడి రెండు రెక్కలు జ్ఞానవైరాగ్యాలకు చిహ్నాలు. కష్టాల్ని పోగొట్టేది గరుడ మంత్రం. జ్ఞానవైరాగ్యాల్ని ప్రసాదించే గరుడ వాహన సేవలో స్వామిని సేవించిన వారికి పునరావృత రహితమైన మోక్ష సుఖం కలుగుతుంది.

హనుమంత వాహనం

హనుమంతునిపై శ్రీరామ అవతారంలో ఉన్న స్వామి వారిని దర్శించుకుంటే సమస్త మానవులకు బలం, కీర్తి, ధైర్యం, ఆరోగ్యం, అజాడ్యాన్ని ప్రసాదిస్తాడని భక్తుల విశ్వాసం.

స్వర్ణరథోత్సవం

అన్ని వాహన సేవల కంటే రథోత్సవంలో స్వామి, అమ్మవార్లు అత్యంత ప్రసన్నంగా దర్శనమిస్తారు. స్వర్ణ రథోత్సవంపై స్వామివార్లను బంగారు కాంతుల మధ్య దర్శించుకున్న భక్తులకు ఆత్మానాత్మ వివేకం కలుగుతుంది.

గజవాహనం

గజం ఐశ్వర్యానికి సూచికం. శరణాగతి మార్గాన్ని తెలిపే గజ వాహనంపై స్వామివారిని దర్శించుకున్న భక్తులకు సకల ఐశ్వర్యం, కోరిన కోర్కెలను నెరవేరుస్తాడని భక్తుల విశ్వాసం.

సూర్యప్రభ వాహనం

అనంత కోటి కిరణాలతో సకల జీవరాశిని రక్షించే సూర్యునిపై కొలువై స్వామి వారు సూర్య నారాయణుడిగా భక్తులకు దర్శనమిస్తారు. స్వామిని దర్శించుకుంటే ఆరోగ్యం, ఐశ్వర్యం, సత్సంతానం, సుజ్ఞానం, దారిద్ర్యపు చీకట్లను పారదోలి వెలుగును ప్రసాదిస్తాడని నమ్మకం.

చంద్రప్రభ వాహనం

చంద్రుడిని అదృష్ట ప్రదాతగా యజుర్వేదం ప్రబోధిస్తోంది. చంద్రప్రభ వాహనంపై కొలువైన స్వామిని దర్శించుకుంటే ఆధ్మాత్మిక, ఆది భౌతిక, ఆది దైవికమనే తాపత్రయాలు తొలగి సుఖవంతమైన జీవనం కలుగుతుందని ప్రతీతి.

రథోత్సవం

సూర్యకిరణాల మధ్య స్వామి, అమ్మవార్లు అత్యంత ప్రకాశవంతంగా రథంపై కొలువుదీరి భక్తులకు దర్శనమిస్తారు. రథోత్సవంలో దేవేరులను దర్శించుకోవడం ద్వారా మోక్షం సిద్ధిస్తుందని భక్తుల నమ్మకం.

అశ్వవాహనం

పరమాత్ముడైన హరిని అశ్వవాహనంపై దర్శించుకునే భక్తులకు సకల దోషాలు తొలగుతాయి.

చక్రస్నానం

బ్రహ్మోత్సవాల్లో చివరిరోజు ఆలయ సమీపంలోని పుష్కరిణిలో స్వామి వారి చక్రతాళ్వారుకు వైఖానస ఆగమోక్తంగా స్నపన తిరుమంజనం చేస్తారు. అనంతరం శాస్త్రోక్తంగా చక్రస్నాన ఘట్టాన్ని నిర్వహిస్తారు. చక్రస్నానం రోజున భక్తులు పుష్కరిణిలో స్నానమాచరిస్తే సకల శుభాలు కలుగుతాయి.

ధ్వజావరోహణం

ఉత్సవాలు నిర్విఘ్నంగా కొనసాగాలంటూ మొదటి రోజు ఏర్పాటు చేసిన ధ్వజపటాన్ని ఆలయ అర్చకులు 9వ రోజు రాత్రి అవరోహణ చేస్తారు. బ్రహ్మోత్సవాలకు సకల దేవతలు, అష్టదిక్పాలకులను ఆహ్వానించి తొమ్మిది రోజుల పాటు ఎటువంటి అవరోధాలు లేకుండా సజావుగా కొనసాగాలని ఈ ధ్వజపటాన్ని ఎగురవేస్తారు. బ్రహ్మోత్సవాలు ముగియడంతో రాత్రి ధ్వజావరోహణం చేయడంతో బ్రహోత్మవాలు పరిసమాప్తి చెందుతాయి.

క్లుప్తంగా

టీడీపీ నేతల నుంచి శ్మశానాన్ని కాపాడాలని వినతి



సజ్జల రామకృష్ణారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కుప్పయ్య, గ్రామస్తులు

తిరుపతి మంగళం: వందేళ్ల నాటి శ్మశాన స్థలాన్ని టీడీపీ నేతలు కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టారని, వాటిని తొలగించి శ్మశాన స్థలాన్ని కాపాడాలని వైఎస్సార్ సీపీ తిరుపతి 50వ డివిజన్ అధ్యక్షుడు కుప్పయ్య కోరారు. ఆయన ఆదివారం తిమ్మి నాయుడుపాళెం హరిజనవాడ వాసులతో కలిసి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ తమ గ్రామం ముందు ఉన్న శ్మశాన స్థలంలో కర్మక్రియలు జరుపుకుంటున్నామని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో టీడీపీ నేత వెంకటరత్నం తన అనుచరులతో కలిసి శ్మశాన స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. గ్రామస్తులు ప్రశ్నిస్తే అటవీ భూమిలో శ్మశానం వచ్చేలా చేస్తానని మభ్యపెడుతున్నాడని ఆరోపించారు. టీడీపీ ప్రభుత్వంలో న్యాయం చేయలేదని వాపోయారు. ఆక్రమణలు తొలగించి, గ్రామస్తులు కర్మక్రియలు జరుపుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన సజ్జల రామకృష్ణారెడ్డి జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి తగు న్యాయం చేస్తానని చెప్పారు.

ఘనంగా మాఘ పౌర్ణమి పూజలు

పాకాల: ఊట్లవారిపల్లి సమీపంలోని ఆనంద గిరి కొండపై వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో ఆదివారం మాఘ పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. స్వామిని వేకువ జామున సుప్రభాతంతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు చేశారు. అనంతరం ప్రత్యేక అభిషేకాలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీల అభ్యున్నతికి పోరాటాలు

తిరుపతి కల్చరల్: రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ప్రజల అభ్యున్నతి కోసం పోరాటాలు సాగిస్తామని ఆలిండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గంటా నరసింహులు తెలిపారు. అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం ఆ సంఘం సమావేశం నిర్వహించారు. ఆర్గనైజేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పూసపాటి వెంకటరమణ, తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా వెంకటాచలం, రాష్ట్ర కన్వీనర్‌గా కోగిల ధర్మయ్యను నియమించినట్లు తెలిపారు.

ముత్తుమారియమ్మకు ప్రత్యేక పూజలు

పాకాల: మండల కేంద్రమైన పాకాలలోని కరీం తుల్లాబాద్, తిరువళ్లూర్ వీధిలోని ముత్తుమారియమ్మకు ఆదివారం స్థానిక ఓంశక్తి అమ్మవారి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సుమారు 500 మంది భక్తులు మేల్ మరవత్తూరు వెళ్లి ఇరుముడి సమర్పించి తిరిగి గ్రామానికి చేరుకున్నారు. స్థానికంగా అన్నదానం చేసి తమ నాయకుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మళ్లీ ఎమ్మెల్యేగా గెలవాలని ఆకాంక్షిస్తూ పూజలు చేశారు. మురళీకృష్ణ, సుధాకర్, జనార్ధన్‌నాయుడు, మురళి, బాబు, ముషీర్, సంపూర్ణ, సత్య, కుమార్, హంస, విజయ పాల్గొన్నారు.

రూ.2.5 లక్షల విరాళం



విరాళం ఇస్తున్న రెడ్డివారిపల్లి గ్రామస్తులు, సర్పంచ్ రేవతి, ప్రకాష్ రెడ్డి దంపతులు

చంద్రగిరి: చంద్రగిరి గ్రామదేవత మూలస్థాన ఎల్లమ్మ ఆలయ పునర్ నిర్మాణానికి ఆదివారం రెడ్డివారిపల్లి గ్రామస్తులు రూ.2,00,116, సర్పంచ్ రేవతి, ప్రకాష్ రెడ్డి దంపతులు రూ.50,116 ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డికి విరాళంగా ఇచ్చారు. వారికి అమ్మవారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

గో సేవా సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జనార్ధన్

తిరుపతి కల్చరల్: రాష్ట్రీయ గో సేవా సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తిరుపతికి చెందిన మేనపటి జనార్ధన్‌ను నియమించినట్టు ఆ సంఘం అధ్యక్షుడు పి.రామచంద్రరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని గోవు భక్తులను అనుసంధానించడం ద్వారా గోవు విశిష్టతను చాటడంతో పాటు గోవుల సంరక్షణకు కృషి చేయాలని సూచించారు. రాష్ట్రీయ గో సేవా సంఘ్ బలోపేతానికి కృషి చేయాలని తెలియజేశారు. తనను ఎంపిక చేసిన గో సేవా సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుకు జనార్ధన్ కృతజ్ఞతలు తెలియజేశారు.

టీటీడీ ఆర్జిత సేవ ఇన్‌స్పెక్టర్ అరెస్ట్

తిరుచానూరు: వాకీటాకీతో దాడి కేసులో టీటీడీ ఆర్జితం సేవ ఇన్‌స్పెక్టర్ దామోదరంను తిరుచానూరు పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. గత నెల 26న తిరుచానూరు అమ్మవారి ఆలయంలో ప్రొటోకాల్ కానిస్టేబుల్ శేషాద్రిపై వాకీటాకీతో దాడి చేశారు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆలయంలోని సీసీ టీవీ పుటేజ్ ఆధారంగా దర్యాప్తు చేపట్టి దామోదరంను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

భావి భారత నిర్మాణానికి నాంది యువ ధార్మికోత్సవం

తిరుమల: యువతకు విద్యతో పాటు వినయం, సంస్కారం అలవడినప్పుడే సమాజంలో మంచి పౌరులుగా గుర్తింపు పొందుతారని టీటీడీ పీఆర్వో టి.రవి తెలిపారు. తిరుమల ఆస్థాన మండపంలో ఆదివారం యువ ధార్మిక సమ్మేళనం ప్రారంభమైంది. ఆయన మాట్లాడుతూ యువ ధార్మికోత్సవ కార్యక్రమం భావి భారత నిర్మాణానికి నాంది అని పేర్కొన్నారు. పూర్వీకులు అందించిన వేదాల్లోని సారాన్ని, అధ్యాత్మిక చింతనను చిన్నతనం నుంచి అలవర్చుకోవడం ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. సీఏఓ శేషశైలేంద్ర మాట్లాడుతూ యుక్త వయసులో ప్రతి మనిషీ నేర్చుకునే విషయాలు జీవితాంతం గుర్తుండిపోతాయని చెప్పారు. ఈ కారణంగానే భారత యువత ఆధ్యాత్మికంగా శక్తిమంతులుగా ఉందన్నారు. మానవ జీవితంలో రామాయణం, భగవద్గీత, భాగవతాల ప్రాముఖ్యతను వివరించారు. దాససాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి పి.ఆర్.ఆనందతీర్థాచార్యులు మాట్లాడుతూ యువ ధార్మిక సమ్మేళనం ద్వారా యువత ఆధ్యాత్మికంగా, ఉన్నతంగా జీవించవచ్చని చెప్పారు. ప్రతి ఒక్కరికీ విద్య రావచ్చుని, సంస్కారం రాదన్నారు. సంస్కారం కలిగిన వ్యక్తి దేవుడి గురించి ఆలోచిస్తాడని పేర్కొన్నారు. పక్షికి రెండు రెక్కలు ఉన్నట్లు మనిషి ఉన్నత శిఖరాలను చేరుకోవడానికి రెండు రెక్కలు కావాలన్నారు. అందులో ఒకటి మానవ ప్రయత్నం, రెండోది దైవానుగ్రహం అని తెలియజేశారు. వేదాలు, పురాణాలు, ఉపనిషత్తులు సంస్కారవతమైన జీవితాన్ని అలవర్చుకోవడానికి ఎంతగానో ఉపయోగపడతాయని వివరించారు. కార్యక్రమంలో ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి విచ్చేసిన దాదాపు 1600 మంది 10 నుంచి 15 ఏళ్లలోపు పిల్లలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వక్తలు

గరికపాటి ఆశయాలను కొనసాగిద్దాం

తిరుపతి కల్చరల్: ప్రజా కళాకారుడు గరికపాటి రాజారావు ఆశయాలను కొనసాగించాలని ఏపీ ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య తెలిపారు. రాజారావు జయంతి సందర్భంగా ఆదివారం ఓటేరు గంగిరెద్దుల కాలనీలో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆయన మాట్లాడుతూ ఎందరో నటీ నటుల ను సినీ ప్రపంచానికి అందించిన ఘనత రాజారావుదేనన్నారు. ప్రజా కళల ద్వారానే సంస్కృతి, సంప్రదాయాలు, మానవ విలువలను నిలబెట్టగలమని నమ్మారని పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధనతోపాటు నేటి పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలపై కొత్త కళారూపాలతో ప్రజలను చైతన్యవంతులను చేయాల్సిన బాధ్యత ప్రజానాట్యమండలిపై ఉందన్నారు. ప్రజానాట్య మండలి తిరుపతి జిల్లా కార్యదర్శి జి.నాగరాజు, సహాయ కార్యదర్శి డప్పు సూరి, సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్, జానపద నాటక రంగ కళాకారుడు కె.పద్మనాభ రెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.రామకృష్ణ, పూర్ణ, స్వప్న, అలివేలు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని ఆదివారం ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, డెప్యూటీ సీఎం నారాయణస్వామి, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కేంద్ర సహాయశాఖ మంత్రి మురుగన్, తెలంగాణ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం అందించగా అధికారులు ప్రసాదాలతో సత్కరించారు.



ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, డిప్యూటీ సీఎం నారాయణస్వామి, విప్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి

మూడు రాజధానులతోనే రాష్ట్రాభివృద్ధి

సజ్జల రామకృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడుతూ మూడు రాజధానులతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. స్వామి ఆశీస్సులు రాష్ట్రానికి ఉండాలని కోరుకున్నానని తెలిపారు. విభజన సమయంలో ఏపీకి తీవ్ర అన్యాయం జరిగిందని, ప్రత్యేక హోదాతో పాటు రాష్ట్రానికి ఇతర ప్రయోజనాలు రావాలన్నారు. ఏపీ దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని, ఆదర్శవంతమైన రాష్ట్రంగా కొనసాగుతోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో జరుగుతున్న సంక్షేమాభివృద్ధి, భవిష్యత్‌లో కూడా ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నానన్నారు.

నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా

తిరుపతి కల్చరల్: ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం తిరుపతి జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చేయనున్నట్టు సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి తెలిపారు. ఆయన ఆదివారం ఆటో ప్రచార జాతాను ప్రారంభించారు.

బలిజ భవన్‌ను రక్షించాలని వినతి

తిరుపతి కల్చరల్: నరసింహ తీర్థం రోడ్డులోని బలిజ భవన్ ఆక్రమణకు గురికాకుండా కాపాడాలని బలిజ జేఏసీ అధ్యక్షుడు నీలం బాలాజీ, కాపు సంక్షేమ యువసేన రాష్ట్ర అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణ ప్రసాద్ కోరారు. వారు ఆదివారం ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డికి వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే భూమన వెంటనే తహసీల్దార్‌కు చెప్పి స్థలాన్ని శుభ్రం చేయించి బలిజ భవన్ పరిరక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బలిజల ఆకాంక్ష అయిన బలిజ భవన్‌ను పూర్తి చేసేందుకు తన వంతు సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు. అఖిల భారత గాజుల బలిజ సంఘం అధ్యక్షుడు ఆళ్వారు మురళి, కాపునాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు కరుణానిధి, రవీంద్ర, విజయలక్ష్మి, శంకరప్ప, వనబోలు మధు, చెంచుకృష్ణ, సుబ్రమణ్యం, సతీష్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే భూమన ఆదేశాల మేరకు డెప్యూటీ తహసీల్దార్ రామచంద్రయ్య, సర్వేయర్ రమణ బలిజ భవన్ స్థలం వద్దకు చేరుకున్నారు. సర్వే చేసి పిచ్చి మొక్కలను తొలగించారు. త్వరలో స్థలాన్ని శుభ్రం చేసే కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు.



బలిజ భవన్ స్థలాన్ని సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

వేడుకగా మహా చండీ హోమం



పూర్ణాహుతి చేస్తున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి దంపతులు



గంగమ్మ ఆలయ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి కల్చరల్: మాఘ పౌర్ణమి సందర్భంగా తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఆదివారం మహా చండీ హోమాన్ని వేడుకగా నిర్వహించారు. ఇందులో భాగంగా అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలోని హోమ మండపంలో అమ్మవారిని కొలువుదీర్చి శాస్త్రోక్తంగా మహా చండీ హోమం చేపట్టారు. ఉదయం 8.30 గంటలకు ప్రారంభమైన హోమం 11.45 గంటలకు మహా పూర్ణాహుతితో ముగిసింది. డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి దంపతులు, ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, ఈవో ఎం.మునికృష్ణయ్య, పాలక మండలి సభ్యులు పి.ధనశేఖర్, వి.క్రిష్ణమ్మ పాల్గొన్నారు.

ఆలయ పనుల పరిశీలన

తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో చేపట్టిన పునర్ నిర్మాణ పనులను ఆదివారం ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి పరిశీలించారు. అనుకున్న ప్రకారం నిర్ణీత సమయానికి అమ్మవారి గర్భాలయం అద్భుత రీతిలో పూర్తి కావాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు.

కందాటి శంకర్ రెడ్డి మృతికి సంతాపం





శంకర్‌రెడ్డి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు భూమన కరుణాకరరెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

తిరుపతి మంగళం: తిరుపతి మున్సిపల్ మాజీ చైర్మన్ కందాటి శంకర్‌రెడ్డి ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కందాటి శంకర్‌రెడ్డి నివాసానికి వెళ్లి ఆయన భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

తిరుపతి రూరల్: కందాటి శంకర్ రెడ్డి మృతికి చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సంతాపం తెలిపారు. ఆయన ఆదివారం శంకర్‌రెడ్డి ఇంటికి చేరుకుని భౌతిక కాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

తిరుపతి కల్చరల్: కందాటి శంకర్‌రెడ్డి మృతికి సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఎస్వీయూలో విద్యార్థి దశ నుంచి కందాటి శంకర్‌రెడ్డి తనకు పరిచయమని పేర్కొన్నారు. చంద్రబాబుకు కుడి భుజంలా కొనసాగారని తెలిపారు. అందరితో చనువుగా ఉండే శంకర్‌రెడ్డి మృతి బాధాకరమని తెలిపారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి కూడా సంతాపం ప్రకటించారు. అదేవిధంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు సంతాపం తెలియజేశారు.

వైఎస్సార్‌సీపీ నేత రాజారెడ్డి మృతికి ఎమ్మెల్యే నివాళి



రాజారెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

పాకాల: లింగనపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత రాజారెడ్డి(64) ఆదివారం మృతి చెందారు. చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అక్కడికి చేరుకుని రాజారెడ్డి మృతదేహంపై పూలమాల వేసి నివాళు లు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి, బాబు రెడ్డి, రాజారెడ్డి, ప్రకాష్, వరదారెడ్డి పాల్గొన్నారు.



వాణీ జయరాంకు నివాళులర్పిస్తున్న రంగస్థలి ప్రతినిధులు

వాణీజయరాంకు రంగస్థలి నివాళి

తిరుపతి కల్చరల్: ప్రముఖ గాయకురాలు వాణీజయరాంకు ఆదివారం రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో కళాకారులు నివాళులర్పించారు. వాణీ జయరాం గాన మాధుర్యాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి, కార్యదర్శి కేఎస్.రాజా, ఎస్వీ.రామకృష్ణయ్య, టి.సుబ్రమణ్యంరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం

పాకాల: లయన్స్ క్లబ్ చేస్తున్న సమాజ సేవ అభినందనీయమని లయన్ భాను మూర్తిరెడ్డి తెలి పారు. మణిపిరెడ్డిపల్లి సమీపంలోని కల్యాణ మండపంలో ఆదివారం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కె.ఎస్ మస్తాన్ అధ్యక్షతన 317 జిల్లా 6వ రీజియన్ సమావేశం నిర్వహించారు. మదనపల్లికి చెందిన ప్రకృతివనం ప్రసాద్ మాట్లాడుతూ ప్రకృతి ఆహారం ప్రాముఖ్యతను వివరించారు. లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ శ్రీనివాస్ వితరణ చేసిన 3 కంప్యూటర్లను ప్రభుత్వ బాలికల జూనియర్, డిగ్రీ కళాశాలలు, ఉన్నత పాఠశాలకు అందజేశారు. లయన్స్ క్లబ్ సభ్యులు చంద్రారెడ్డి, సుధా, రెడ్డి, గౌతంరెడ్డి, రాజారెడ్డి, రాజేంద్రప్రసాద్, డీసీ రామయ్య, గురుస్వామి నాయుడు, కుప్పుస్వామినాయుడు, విజయబాబు, ఆర్‌వి.ప్రసాద్ పాల్గొన్నారు.

కార్మిక చట్టాలకు తూట్లు పొడుస్తున్న బీజేపీ

తిరుపతి కల్చరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలకు తూట్లు పొడుస్తోందని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్ విమర్శించారు. తిరుపతిలో ఈ నెల 16, 17, 18 తేదీల్లో ఐఎఫ్‌టీయూ ఏడో జాతీయ మహాసభలు నిర్వహించడంపై ఆదివారం ప్రైవేటు కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. జాతీయ మహాసభల ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి రాయపనేని హరిక్రిష్ణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భారతి, కొత్తపల్లి సుబ్రమణ్యం, చిత్తూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీఆర్.జ్యోతి, సురేంద్రనాథ్, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు వెంకటరత్నం, అధ్యక్ష, కార్యదర్శులు రావిశెట్టి వెంకయ్య, సంక్రాంతి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వాన సంఘం ఏర్పాటు

ఐఎఫ్‌టీయూ జాతీయ మహాసభల ఆహ్వాన సంఘం కమిటీ అధ్యక్షులుగా రిటైర్డ్ జడ్జి పి.గుర్రప్ప, ఎస్‌బీబీ బ్రిక్స్ కేవీ.చౌదరి, ప్రధాన కార్యదర్శిగా పి.ప్రసాద్, కోశాధికారిగా రాయపనేని హరిక్రిష్ణ, చీఫ్ పాట్రన్స్‌గా డాలర్ దివాకర్‌రెడ్డి, డీఏ.శ్రీనివాస్, ఎస్‌సీవీ.నాయుడు, వి.వెంకటరత్నం, ప్రసాద్, కొండలరావు, సిపాయి సుబ్రమణ్యం, పసుపులేటి హరిప్రసాద్, గోపి కృష్ణారెడ్డి, భూమన్ ఉన్నారు.